www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 11 మార్చి 2025

5

తిరుపతి

‘పి4’ పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి టౌన్ : కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో జీరో పావర్టీ పి-4 పోస్టర్‌ను డిఆర్ఒ నరసింహులుతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. సమగ్రాభివృద్ధి లక్ష్యంగా స్వర్ణాంధ్ర -2024లో భాగంగా పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు పి-4 అమలు చేస్తున్నామన్నారు. అధిక సంపన్న వ్యక్తుల సహకారంతో పేదరికం లేని సమాజాన్ని సాధించుటకు ఈ విధానాన్ని రూపొందించామన్నారు. ప్రజలు తమ విలువైన అభిప్రాయాలను మార్చి 9 నుంచి 25వ తేదీ లోపు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఓ ప్రేమచంద్ర, డిఎల్‌డి ఓ జివి నారాయణ రెడ్డి, డిపిఓ సుశీల దేవి, పిడి డిఆర్‌డిఎ శోభన్ బాబు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌సెల్.. స్పందన... ప్రజా సమస్యల పరిష్కార వేదిక... పేరు ఏమైతేనేం ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం.. అయితే ప్రజా సమస్యల పరిష్కారం ఎలా ఉందంటే ...తన అనుభవంలో ఉన్న భూమిలో మామిడిచెట్లను కాల్చేసి, పెత్తందారుల పేరుతో 1బి అడంగల్ చేసుకున్నారని ఓ 85 ఏళ్ల వృద్ధుడు యర్రావారిపాలెం రెవెన్యూ అధికారుల చుట్టూ ఐదేళ్లు తిరిగాడు.. ప్రస్తుతం కలెక్టరేట్ చుట్టూ ఏడాదిగా తిరుగుతూనే ఉన్నాడు.. తాను బతికుండగా ఈ సమస్య పరిష్కారం కాదేమోననే ‘నిరాశా’వాదంలో తనను పలకరించిన ‘ప్రజాశక్తి’కి తన గోడు వినిపించాడు... ఇదండీ అక్కడి సమస్యలు పరిష్కారమయ్యే తీరు.. ఇక అర్జీదారుల సమస్యలు తరువాత.. కలెక్టరేట్‌లోనే తిష్ట వేసుకున్న సమస్యలూ అక్కడి ఉన్నతాధికారులకు కానరాని పరిస్థితి. వందలాదిగా వచ్చే అర్జీదారులకు మండు వేసవిలో కనీసం తాగునీరు అందుబాటులో ఉండదు. ఇక ఉదయం 7 గంటలకే వచ్చి కాస్తంత కడుపు నింపుకుందామనుకుంటే ప్రైవేట్ క్యాంటీన్‌లో రూ.100 సమర్పించాల్సిందే. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను పెట్టి పేదల కడుపు నింపుతున్నామని చెబుతున్న ‘కూటమి’ ప్రభుత్వానికి, కలెక్టరేట్‌కు వచ్చే పేద అర్జీదారుల ‘గోడు’ వినబడదు.. కనబడదు.. కలెక్టరేట్‌కు విచ్చేస్తున్న అర్జీదారులు తమ సమస్యలు తరువాత.. ముందు కలెక్టరేట్‌లో తాగునీరు, పేదలకు అందుబాటు ధరల్లో ఓ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నారు. ఇదండీ.. ఈనాటి ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ అర్జీదారుల గోడు..

కలెక్టరేట్ సమస్యలివి..!

- కలెక్టరేట్‌లో దాహం దాహం
- భూ సమస్యపై ఏడాదిగా...
- అక్కడ భోజనం రూ.100
- కలెక్టర్‌గారూ..స్పందించాలి మీరు..

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

నిరుపయోగం

తిరుపతి కలెక్టరేట్‌లో దాహం దాహం అంటూ తాగేందుకు నీళ్లు లేక జనం గొంతెండుతోంది. అసలే వేసవికాలం.. ఆపైన కలెక్టరేట్‌లో నీళ్లు లేకపోవడం దారుణం. అర్జీదారులకు నీరు అందించాల్సిన జిల్లా ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారు. గత్యంతరం లేక మధ్యతరగతి ప్రజలు పక్కనే ఉన్న ప్రైవేట్ క్యాంటిన్‌లో లీటర్ బాటిల్ రూ.25 వెచ్చించి గొంతు తడుపుకుంటున్నారు. అర్జీదారులు కొంతమంది డబ్బులు పెట్టే స్తోమత లేక దాహంతో అల్లాడుతున్నారు. ప్రతి సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరుగుతూనే ఉంటుంది. సోమవారం దాదాపు ఏడు గంటల పాటు జరిగే ఈ వేదికలో అర్జీలిచ్చేందుకు క్యూలైన్‌లో నిల్చుని తమ బాధలు విన్నవించుకుంటారు. కలెక్టరేట్‌లో తాగునీరు దొరికే పరిస్థితి లేదు. ప్రజల కోసమే పెట్టామని వాటర్‌కూలర్ ఉందని చెబుతున్నా నిరుపయోగంగా ఉంది. ట్యాప్ తిప్పితే నీరు రాదు.

ప్రసాదమంత పెట్టి రూ.100 వసూలు

అది తిరుపతి కలెక్టరేట్.. సోమవారం జరిగే గ్రీవెన్స్‌సెల్‌కు వెళితే ఫిర్యాదుదారులకు పస్తులే. ఒకవేళ సుగర్, బిపీ ఉన్న రోగులు ఆకలి వేస్తే భోజనం చేయాలంటే కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ హోటల్లో వాటర్ బాటిల్‌తో సహా భోజనం రూ.100. భోజనం 75 అయితే, వాటర్ బాటిల్ 25 రూపాయలు. అది కూడా కడుపు నిండా పెట్టరు. దేవుడు గుడిలో ప్రసాదం పెట్టినట్లు ఇక్కడ భోజనం వడ్డిస్తారు. చాలీచాలని భోజనం కోసం ప్రతి సోమవారం ఆ క్యాంటీన్ వద్ద పెద్ద ఘర్షణే జరుగుతుంది. కూటమి ప్రభుత్వం రాక ముందు అప్పటివరకూ తిరుపతి కలెక్టరేట్‌లో నడుపుతున్నది వైసిపికి చెందిన నాయకుడు నడిపేవారు. రూ.50 ఇస్తే ప్లేట్ భోజనం, రూ.70 ఇస్తే ఫుల్‌మీల్స్. అర్జీదారులే కాకుండా కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులు సైతం అక్కడే భోజనం చేసేవారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన తరువాత ఆ క్యాంటీన్‌ను మూసివేశారు. ప్రభుత్వం స్పందించి కలెక్టరేట్‌లో అన్నా క్యాంటీన్ పెట్టాలని అనేకమార్లు సిపిఎం సైతం డిమాండ్ చేసినా పట్టించుకున్న దాఖలా లేదు.

కడుపు కాలిపోతుంది : భక్తవత్సలనాయుడు, అర్జీదారుడు, ఏర్పేడు

భూ సమస్యపై గత రెండు నెలలుగా ఎనిమిది వారాలుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉన్నా. నా సమస్య పరిష్కారం కాలేదు. సుగర్, బీపీ ఉంది. సుగర్ డౌన్ అవుతుందని పక్కనే ఉన్న క్యాంటీన్‌లో తిందామని వెళితే అగ్గి రేట్లు. ప్రాణాలు కాపాడుకుందామని ఎంత రేటున్నాపర్లేదని వెళితే దేవుని గుడిలో ప్రసాదం పెట్టినట్లు పెడుతున్నారు. ఆ ధరలూ, వారు పెట్టే భోజనం చూసి కడుపు రగిలిపోతుంది. కలెక్టర్ స్పందించాలి. గతంలో

ఈ క్యాంటిన్‌లో అన్నం తింటే నీళ్ల బాటిల్ కొనుక్కోవాలి

ఉన్నట్లే క్యాంటీన్ ఏర్పాటు చేయాలి. అన్నా క్యాంటీన్ పెడితే పేదలకు ఎంతో ఉపయోగకరం.

ఓటేరు చెరువులో ఎర్రమట్టిని తొలగించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి రూరల్ మండలం ఓటేరు చెరువులో భూకబ్జాదారులు అక్రమంగా తోలిన ఎర్రమట్టిని తక్షణమే తొలగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఆర్‌పిఐ నాయకులు పి.అంజయ్య, సిపిఎం నాయకులు జయచంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం ఇస్తూ ఓటేరు చెరువును పరిరక్షించాలని కోరారు. రెవెన్యూ అధికారులు పెట్టిన బోర్డును చింపేసిన రౌడీలను తక్షణం అరెస్టు చేయాలన్నారు. ఓటేరు చెరువు పరిరక్షణలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, పేదలను సమీకరించి చెరువులో ఎర్రజెండాలు నాటి ఇల్లులేని నిరుపేదలకు ఇళ్లస్థలాలను పంపిణీ చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందిస్తూ చెరువును తప్పకుండా కాపాడతామని తెలిపారు.

నేను పోయే లోపైనా పరిష్కరించండి

85 ఏళ్ల చెంగయ్య

ఆయన వయస్సు 85 ఏళ్లు. ఎస్‌టి కులానికి చెందిన వ్యక్తి. ఇందిరాగాంధీ హయాంలో పొలం లేని పేదలకు యర్రావారిపాలెం మండలం విఆర్ అగ్రహారం పంచాయతీపరిధిలో బోడేవాండ్లపల్లి సర్వే నంబర్2009/12లో అరవాండ్లపల్లి, నడింపల్లికి చెందిన వారికి 70 మంది ఎస్టీలకు భూమి ఇప్పించారు. కొండా గుట్టా చదును చేసి వ్యవసాయ భూమిగా మరల్చుకున్నారు. అరవాండ్లపల్లికి చెందిన మాలే చెంగయ్య ఐదు ఎకరాలు 50 ఏళ్లుగా పంటలు పండించుకుంటున్నాడు. మామిడిచెట్లు నాటి, అంతరపంటగా వేరుశనగ వేస్తున్నాడు. కోటకాడపల్లి, తడికాలచేనుపల్లికి చెందిన పెత్తందారులు ఆరేళ్ల క్రితం సహదేవమ్మ, కృష్ణ, శంకరలు మాలేచెంగయ్య మామిడి తోటకు అగ్గి పెట్టారు. 30 మామిడిచెట్లు కాలి బూడిదయ్యాయి. పోలీసు కేసు నమోదయ్యింది. ఈ నేపథ్యంలోనే రెవెన్యూ అధికారులు చేతివాటం ప్రదర్శించారు. చెంగయ్య అనుభవం లోని 1బి అడంగల్ భూమిని ఆ ముగ్గురి పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించేశారు. మనవరాలి పెళ్లి చేయాలని ఐదేళ్లుగా పొలం అమ్మేందుకు ప్రయత్నించాడు. అనుభవం చెంగయ్యది, పట్టా పాసు పుస్తకం పెత్తందారులకు ఉండడంతో అమ్మలేకపోయాడు. మనవరాలి పెళ్లి చేయలేకపోయాడు. తన ఆధీనంలో భూమి ఉందని, చుట్టుపక్కల రైతులతో సంతకం చేయించి యర్రావారిపాలెం రెవెన్యూ అధికారుల చుట్టూ ఐదేళ్లు తిరిగాడు. 85 యేళ్ల వృద్ధుడు కలెక్టరేట్ చుట్టూ ఏడాదిగా తిరుగుతూనే ఉన్నాడు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో ‘ప్రజాశక్తి’కి తన గోడు వినిపించి కన్నీరుమున్నీరయ్యాడు. ఈ వయస్సులో రామా గోవిందా అంటూ ఇంటికాడ ఉండాల్సిన ముదుసలి, ఇతరుల సాయంతో ఊరి నుంచి తిరుపతికి వచ్చి మండుటెండలో కలెక్టరేట్ వద్ద ఉండటం గమనార్హం. తాను పోయేలోపు పొలం సమస్య పరిష్కారమవుతుందన్న నమ్మకం లేదని వాపోయాడు.

పెయింటింగ్ సరే... పట్టాలేవి..? : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

స్కావెంజర్స్ కాలనీ ఇళ్లకు పెయింట్స్ వేశారని, మంచి కార్యక్రమమని, అయితే వారికి అత్యవసరంగా కావాల్సింది పట్టాలని సిపిఎం జిల్లా నాయకులు టి.సుబ్రమణ్యం, నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా సోమవారం స్కావెంజర్స్ కాలనీలో పర్యటించారు. ఈ కాలనీలో ఏళ్ల తరబడి మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నివాసం ఉంటున్నారని, కరెంట్ బిల్లులు చెల్లిస్తున్నారని, అయినా ఇంతవరకూ వాళ్లకు పట్టాలివ్వలేదన్నారు. ఇళ్లకు పట్టాలిచ్చి, రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పి.బుజ్జి, జయంతి, పి.చిన్న, రాజు, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

తుడా టవర్స్ వేలానికి విశేష స్పందన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి ఆర్సీ రోడ్డులో నిర్మిస్తున్న తుడా టవర్స్ 2026, మార్చి నాటికి పూర్తయి అందుబాటులోకి తెస్తామని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అన్నారు. సోమవారం ఉదయం నిర్మాణ పనులను పరిశీలించారు. తుడా టవర్స్ ప్లాట్స్ వేలం ఈ నెల 8వ తేది ప్రారంభమై 12 వ తేదీతో ముగుస్తుందని అన్నారు. వేలానికి మంచి స్పందన వస్తోందని అన్నారు. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో మరిన్ని టవర్స్ నిర్మించేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. ప్రజలు వీక్షించేందుకు వీలుగా మోడల్ ప్లాట్ కూడా ఏర్పాటు చేశామని అన్నారు. నగరంలో ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్నామని, త్వరలోనే ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్.సి. మునిక్రిష్ణ, కార్పొరేటర్లు ఎస్.కె.బాబు, నారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్లు శ్యాంసుందర్, కష్ణారెడ్డి, ఈ.ఈ.రవీంద్ర, డి.ఈ.రాజు, తదితరులు ఉన్నారు.

కార్పొరేషన్‌లో 50 వినతులు

సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 50 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. ఫోన్ ద్వారా 10 మంది సమస్యలు తెలపగా, 40 మంది అర్జీలిచ్చారు. డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, కార్పొరేటర్ కుడితి సుబ్రమణ్యం, మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణకు కేటాయించిన ఛాంబర్‌ను ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు.

నేడు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ 45వ వర్ధంతి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులవారి సంకీర్తనలను రాగి రేకుల నుండి పరిష్కరించి గ్రంథస్తం చేయడంతోపాటు వందల కతులను స్వరపరిచిన సంగీత, సాహిత్య విద్వాంసులు శ్రీ రాళ్లపల్లి అనంతకష్ణశర్మ 46వ వర్ధంతి కార్యక్రమం మార్చి 11న మంగళవారం జరగనుంది. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు, హిందూ ధార్మిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పిజి కళాశాల ప్రాగణంలోని శ్రీ రాళ్లపల్లి అనంతకష్ణశర్మ విగ్రహానికి పుష్పాంజలి సమర్పిస్తారు. అనంతరం తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 10.30 గంటలకు సాహితీ సదస్సుతో కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో శ్రీ అనంతకష్ణశర్మ మనవరాలు, జాతీయ సంస్కత విశ్వవిద్యాలయం ఆంగ్ల శాఖ విభాగాధిపతి ఆచార్య రాళ్లపల్లి దీప్త ప్రత్యేక అతిథిగా పాల్గొంటారు. రాళ్లపల్లి సాహిత్యంపై తిరుపతికి చెందిన శతావధానిఆముదాల మురళి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం అధ్యాపకులు డా.లక్ష్మీనారాయణ ప్రసంగిస్తారు.

ప్రభుత్వ పథకాల్లేవని, స్కూళ్ల విలీనంతో చదువు దూరమవుతుందని గిరిజనుల ఆవేదన (కెవిబిపురం వాసులు)

గడువులోపు సత్వరం పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీదారులకు గడువులోపు పరిష్కారం చూపాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అర్జీలు స్వీకరించారు. అత్యధికంగా రెవిన్యూ శాఖకు సంబంధించి 172 అర్జీలు వచ్చాయి. పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, రోజ్ మాండ్ పాల్గొన్నారు. కెవిబిపురం మండలం ఎస్ఎల్‌పురం గ్రామంలో మూడు, నాలుగు, ఐదో తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థులను కళత్తూరు పాఠశాలకు మార్పిడి చేశారని, దీనివల్ల రెండున్నర కిలోమీటర్ల దూరం పెరిగిపోతుందని, ఈ కారణంగా విద్యార్థులు విద్యకు దూరమవుతారని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు శేఖర్ తెలిపారు. గిరిజన గ్రామాల్లో పిల్లలకు, పెద్దలకు ఆధార్ కార్డులు లేని కారణంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందడం లేదని పేర్కొన్నారు.

‘శ్రీమారుతి’లో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి - తిరుపతి సిటి

బెంగళూరు, చెన్నై, హైదరాబాదు లాంటి మెట్రో నగరాలకు ధీటుగా శ్రీ మారుతి హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మారుతి కష్ణ తెలిపారు. స్థానిక బస్టాండ్ సమీపంలోని శ్రీ మారుతి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో 37 సంవత్సరాల మహిళకు అరుదైన ఊపిరితిత్తుల శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మారుతి కష్ణ విలేకర్లతో మాట్లాడుతూ 37 సంవత్సరాల మహిళ ఆయాసం ఎక్కువగా ఉండటం, ఎడమ పక్కన ఊపిరితిత్తి పూర్తిగా మూసుకుపోవడంతో బెంగళూరు నుండి శ్రీ మారుతి హాస్పిటల్‌కు వచ్చారన్నారు. ఊపిరితిత్తుల్లో క్యాన్సర్ గడ్డ ఉండడం, అదేవిధంగా నీరు పేరుకుపోయి ఊపిరి పీల్చుకోవడం బాగా ఇబ్బందిగా ఉన్నట్లు గమనించారు. ప్రముఖ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ నరసింహ పర్యవేక్షించి తన వైద్య బందంతో కలిసి బ్రోంచో స్కోపి చేసి

ఊపిరితిత్తులలోని క్యాన్సర్ గడ్డను తొలగించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ నరసింహ, సిటీ సర్జన్, అనస్తీసియా వైద్యులు డాక్టర్ మహేష్ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో గ్లకోమా అవగాహనా వారోత్సవాలు

తిరుపతి సిటి : స్విమ్స్ కంటి వైద్య విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ గ్లకోమా అవగాహనా వారోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి వాల్మీకి సర్కిల్ వరకూ అవగాహనా ర్యాలీ మ్యారథాన్‌ను సోమవారం నిర్వహించారు. ఉపకులపతి డాక్టర్ ఆర్‌వి కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. గ్లకోమా అంటే నీటికాసులు అని అర్థమని, దీనివల్ల దృష్టి కోల్పోవడం, శాశ్వత అంధత్వం ఏర్పడతాయని, వైద్యులను సంప్రదించి లేజర్ చికిత్స ట్రాబెక్యూలెక్టమీ, మైక్రోఇన్వాసివ్ గ్లాకోమా సర్జర్ ద్వారా పూర్తిగా నయం చేసుకోవచ్చునని తెలిపారు. ఈ సంవత్సరం థీమ్ ఉంటింగ్ ఫర్ ఏ గ్లాకోమా ఫ్రీ వరల్డ్ అనే నినాదాలతో కొనసాగింది. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ఆర్.ఎం.ఓ. డా కోటిరెడ్డి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

‘కక్షసాధింపు’ పర్వం

- ఎనిమిదేళ్లుగా ఒకేచోట తిష్ట
- శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆగడాలు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్

తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపాలిటీలో ఎనిమిది సంవత్సరాలుగా నిబంధనలకు విరుద్ధంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ విధులను నిర్వహిస్తున్నారు. రాజకీయ పలుకుబడితో వెంకటగిరిలోనే తిష్టవేసి అవినీతి అక్రమాలకు కేరాఫ్‌గా మారారన్న విమర్శలూ లేకపోలేదు. రాజకీయ పలుకుబడితో, ఎవరు అధికారంలో ఉంటే వారి అడుగులకు మడుగులొత్తుతూ, కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నాడన్న అపవాదును ఆయన మూటగట్టుకున్నారు. వేరే మున్సిపాలిటీకి బదిలీ చేసినా, అక్కడ కొద్ది నెలలు మాత్రమే డ్యూటీ చేసి, తిరిగి వెంకటగిరికే ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటున్నారంటే ఆయనకు రాజకీయంగా ఎంతటి పలుకుబడి ఉందో అర్థం చేసుకోవచ్చు.

వాహనాల్లో చేతివాటం

మున్సిపాలిటీలో మినీలారీ ఒకటి, పెద్దలారీ ఒకటి, ఆటోలు మూడు, ట్రాక్టర్లు ఐదు ఉన్నాయి. పెద్దలారీ ఒకటి, ట్రాక్టర్ ఒకటి, ఆటోలు మూడు గత రెండేళ్లుగా మూలన పడి మరమ్మతుకు నోచుకోకుండా ఉన్నాయి. అయితే అవి రన్నింగ్‌లో ఉన్నట్లు, ఆయిల్ పడుతున్నట్లు, మధ్యమధ్యలో మరమ్మతులు చేయించినట్లు పెద్దమొత్తంలోనే బిల్లులు పెడుతుంటారని సమాచారం. అలాగే యూనియన్ల విషయంలోనూ జోక్యం చేసుకుంటూ మున్సిపల్ కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని కార్మిక నాయకులు వాపోతున్నారు. తాను కొమ్ముగాసే యూనియన్‌లో ఉంటే మస్టర్‌కు వచ్చినా రాకపోయినా హాజరు వేయడం, జీతాలు తగ్గకుండా ఫుల్ జీతం వచ్చేలా చూడటం చేస్తూ కార్మికులను మభ్యపెడుతున్నారు. ఆయన మాట వినని కార్మికులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ డ్యూటీలకు వచ్చినా ఆబ్సెంట్ వేస్తూ, జీతాల్లో కోత పెడుతూ కార్మికుల పొట్టగొడుతున్నారని బాధిత కార్మికులు వాపోతున్నారు. ఆయన మాట వింటే నెలరోజులు పనికి రాకపోయినా సజావుగా జీతాలు కార్మికుల అకౌంట్లకు పడిపోతుంటాయి. అదే ఇతర యూనియన్‌లో ఉండేవారికి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుండటం కార్మికుల్లోనే విభజించు, పాలించు ధోరణితో వ్యవహరిస్తున్నారని యూనియన్ నేతలు వాపోతున్నారు. వల్లూరు ఇందిరమ్మ కరోనా సమయం నుంచి డైలీ వేజెస్ పద్ధతిలో పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఆమెతో పాటు పనిలో చేరిన వారిని ఆప్కాస్‌లోకి ఎక్కించారు. ఆమెను మాత్రం ఆప్కాస్‌లోకి ఎక్కించకుండా అడ్డుపడుతూ ఉన్నారు. ఒంటరిగా ఎక్కడికి రమ్మంటే అక్కడకు రాలేదన్న కారణంగానే ఆమెపై కక్షగట్టి ఆప్కాస్‌లో రిజిష్టర్ చేయలేదని తెలుస్తోంది. గత నాలుగున్నర సంవత్సరాలుగా ఆమె కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉంది. కక్షసాధింపు చర్యలపై అర్జీలు ఇస్తూనే ఉంది. తాను డ్యూటీకి వచ్చినా ఆబ్సెంట్ వేస్తున్నారని పరమాల సుబ్రమణ్యం, స్వీపర్ పెంచలయ్య, నెలనెలా జీతం తగ్గిస్తూ దిక్కున్న చోట చెప్పుకోమని ఇబ్బంది పెడుతున్నారని డ్రైవర్ పి.రమణయ్య, కొల్లు శేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఒంటరిగా రమ్మన్న చోటకు రాలేదన్న కారణంగా తనను ఆప్కాస్‌లోకి ఎక్కించలేదని, తనకన్నా వెనక వచ్చిన వారికి అవకాశం కల్పించారని డైలీ వేజ్ కార్మికురాలు వల్లూరు ఇందిరమ్మ వాపోయారు.

సావిత్రి బాయి పూలేకు నివాళి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సంఘ సంస్కర్త సావిత్రి భాయి పూలే 128వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఉదయం మహిళా యూనివర్సిటీ సమీపంలో బిసి సంఘర్షణ సమితి ఏర్పాటు చేసిన ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నివాళి అర్పించారు. ఆధునిక విద్య ద్వారానే మహిళల అభివద్ధి సాధ్యమని నమ్మి జీవితాంతం కషిచేసిన గొప్ప నాయకురాలు సావిత్రి భాయి పూలే ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, బిసి సంఘర్షణ సమితి అధ్యక్షులు అక్కినపల్లి లక్ష్మయ్య, సాకం ప్రభాకర్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

తిరుపతి సిటి : చంద్రగిరి నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉండాలనే సంకల్పంతో డాలర్స్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థుల వార్షిక పరీక్షలకు అవసరమైన స్టేషనరీని ఉచితంగా ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ సి.దివాకర్‌రెడ్డి అందజేశారు. తిరుచానూరు పంచాయతీలోని జడ్‌పి హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు సోమవారం పంపిణీ చేశారు. మార్చి 17 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బెస్ట్ ఆఫ్ లక్ తెలియజేశారు.

ఉపాధి కూలీల ‘వేతన’ వ్యథ

ప్రజాశక్తి - ఓజిలి

వామపక్షాల ఉద్యమ ఫలితంగా అమలవుతున్న ఉపాధి హామీ పథకం పాలకుల నిర్లక్ష్యం వల్ల అర్ధాకలితోనే బతుకు జీవనం సాగించాల్సి వస్తోంది. గత రెండు నెలలుగా ఉపాధి పనులు చేసినా, వేతనాలు పడకపోవడంతో కూలీల ఆవేదన వర్ణనాతీతం. పల్లెల్లో కూలీల వలసలను నివారించడంతో పాటు వారికి పని కల్పించి చేసిన పనికి తగినట్లుగా వేతనాలు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా పాల్పడుతుంది. ఎంతో మంది పేద కుటుంబాలకు కడుపు నింపుతున్న ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా నీరు గార్చే విధంగా ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. గ్రామాలలో వలసల నివారణకు ఉపాధి హామీ పథకం ఎంతగానో తోడ్పడుతుంది. ఉపాధి హామీ పనులను చేసుకుని కుటుంబాలను పోషించుకునే పేద మధ్యతరగతి కుటుంబాలకు గత రెండు నెలలుగా వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో నిరుపేద కుటుంబాలు అర్ధాకలితో ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఓజిలి మండలంలోని 26 పంచాయతీల్లో సుమారు 9,134 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో పనులు నిర్వహించిన రెండువేల మంది ఉపాధి హామీ కూలీలకు సంబంధించి 56 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంది. పనులు నిర్వహించి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కూలి డబ్బులు చెల్లించలేదు. ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీలకు వేతనాలు ఇవ్వడంలో పాలక ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఉపాధి కూలీలు ఆవేదన చెందుతున్నారు. దీనితో పాటు పని ప్రదేశంలో కనీసం వసతులు కల్పించకపోవడం వల్ల ఉపాధి కూలీలు పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. ఇటీవల ఎండలు తీవ్రంగా

మండుటెండలోనే పనులు

ఉండడంతో కూలీలు అస్వస్థతకు గురవుతున్నారు. వేసవిలో మార్చి నుంచి జూన్ వరకు కూలీలకు వడదెబ్బ తగలకుండా నీడకోసం టెంట్లు వేసి రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపాధి హామీ మెటీరియల్ బకాయిలు ఏవి?

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ నిధులతో మెటీరియల్ కింద సుమారు మూడు కోట్ల రూపాయల వరకు మంజూరు చేశారు. ఇందులో పలు గ్రామాల్లో సిమెంట్ రహదారులు , మినీ గోకులాలు పనులు కూడా పూర్తయ్యాయి. పనులకు సంబంధించి బకాయిల నిధుల విడుదలలో జాప్యం జరుగుతుంది. వివిధ పనులు నిర్వహించిన వారు అప్పో సప్పో చేసి పనులను పూర్తి చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో మల్లగుల్లాలు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

మండుటెండలో పనులు నిర్వహిస్తున్న ఉపాధి కూలీలు

అరణియార్ ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలి

- 'ప్రజాశక్తి' వార్తకు స్పందన
- అసెంబ్లీలో ప్రశ్నించిన ఎమ్మెల్యే

శాసన సభలో ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలోని అరణియార్‌తో పాటు కాళంగి ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులు ఎప్పుడు చేపడుతారు?' అని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శాసనసభలో సోమవారం ప్రశ్నించారు. ఇటీవల ప్రజాశక్తిలో 'అరణియార్ ఆధునికీకరణ పనులు పూర్తయ్యేనా?' అనే శీర్షిక ప్రచురితమైన వార్తకు ఎమ్మెల్యే స్పందించి శాసనసభలో ప్రస్తావించారు. నియోజక వర్గం లోని ఇరిగేషన్ ప్రాజెక్టులు ఆధునికీకరణ, ఎస్‌సి సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధిపై ఎమ్మెల్యే నిలదీశారు. తమ సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండలంలో అరణియార్ మధ్యతరహా ప్రాజెక్టు ఆధునికీకరణ పనులకు రూ.33 కోట్లు నిధులను అప్పటి టిడిపి ప్రభుత్వం కోరిక మేరకు జైకా (జపాన్ ఇండస్ట్రియల్ కో-ఆపరేటివ్ అసిస్టెన్స్) మంజూరు చేసిందన్నారు. అయితే ఈ పనులను దక్కించు కున్న గుత్తేదారు గత ఐదేళ్లలో కేవలం 17 శాతం పనులను మాత్రమే చేసి వదిలేశారని వాపోయారు. ఈ పనులను పునరుద్ధరించాలని, తద్వారా పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లోని సుమారు 10 వేల ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందించడంతో పాటు ఈ ప్రాజెక్టును నమ్ముకొని జీవించే వేలాది మంది మత్స్య కార్మికులను ఆదుకున్నట్లు అవుతుందన్నారు. నింద్ర, విజయపురం మండలాల ప్రజలకు తాగునీటి కొరత తీర్చవచ్చని ఎమ్మెల్యే వివరించారు. అరణియార్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యే గా, మంత్రిగా ఉన్న సమయాల్లో పలుమార్లు సందర్శించారని, ఆయనకు ప్రాజెక్టుపై సంపూర్ణ అవగాహన ఉందని ఎమ్మెల్యే అన్నారు. కెవిబి పురం మండలంలోని కాళంగి ప్రాజెక్టు గేట్లన్నీ పూర్తిగా తుప్పు పట్టి పాడైపోయాయని వీటి ఆధునికీకరణ కోసం రూ.44 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, వాటికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఉబ్బల మడుగు ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తే వరదయ్యపాలెం, బుచ్చి నాయుడు కండ్రిగ, సత్యవేడు మండలాలకు పైప్ లైన్ ద్వారా తాగునీరు అందించవచ్చని సభ దృష్టికి తెచ్చారు.

సంక్షేమ హాస్టళ్లను అభివృద్ధి చేయండి..

సత్యవేడు నియోజకవర్గంలో సంక్షేమ హాస్టళ్లను సమగ్రంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అసెంబ్లీలో గళం విసిపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తన నియోజకవర్గంలో సుమారు రూ.15 లక్షలు వెచ్చించి సంక్షేమ హాస్టల్ లు మరమ్మతులు చేపట్టామన్నారు. ఇంకా డైనింగ్ హాళ్లు, గదులు, మరుగుదొడ్లు వంటి పనులు సమగ్రంగా చేపట్టి పేద విద్యార్థులను ఆదుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

తల్లి బిడ్డ క్షేమమే ఆరోగ్య శాఖ లక్ష్యం

పిహెచ్‌సి అధికారి విద్యాసాగర్

వైద్య సలహాలు, సూచనలు ఇస్తున్న పిహెచ్‌సి వైద్యాధికారి

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: తల్లి బిడ్డ క్షేమమే ఆరోగ్య శాఖ లక్ష్యమని పిహెచ్‌సి వైద్యాధికారి విద్యాసాగర్ పేర్కొన్నారు. మండలంలోని పిహెచ్‌సి లో ప్రతి నెల నిర్వహించే ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్‌లో భాగంగా బిఎన్ కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని గర్భిణులకు వైద్యాధికారి డాక్టర్ విద్యాసాగర్ ,ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి జాగ్రత్తలు, సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ వైద్యశాలల్లోనే సుఖప్రసవం, ఆరోగ్యకరమైన బిడ్డను పొంది తల్లి బిడ్డ క్షేమంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం పలు పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, ఎం ఎల్ హెచ్ పిలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: ఎస్‌ఐ

వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వాహనాలు నడిపేవారు నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే అపరాధ రుసుం విధించడంతో పాటు, కేసులు నమోదు చేస్తామని గూడూరు రూరల్ ఎస్ ఐ మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. గూడూరు మండల పరిధిలోని పోటు పాలెం కూడలి వద్ద సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. రూరల్ ఎస్‌ఐ మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రధాన రహదారుల్లో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని, అతివేగంతో నడిపినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రాంగ్ రూట్లో వచ్చిన వాహనాల పై కేసు నమోదు చేశారు.

డాక్టర్ మాధవికి 'ఉమెన్ ఆఫ్ అచీవ్ మెంట్' అవార్డు

అవార్డు స్వీకరిస్తున్న డాక్టరు కె మాధవి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)కు చెందిన ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ కె మాధవికి ఉమెన్ ఆఫ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. కర్నూలు జిల్లాలోని ఆర్ఎవి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి దేవరాజ్ యుఆర్‌ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వారు 2025 మార్చి 7, 8వ తేదీలలో నిర్వహించిన 1వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ కె మాధవి 'ఉమెన్ ఆఫ్ అచీవ్ మెంట్ అవార్డ్' అందుకున్నారు. ఈ సందర్భంలో భాగంగా నిర్వహించిన కల్చరల్ ప్రోగ్రామ్స్‌లో సోలో డ్యాన్స్ పోటీలలో స్విమ్స్ ఫిజియోథెరపీ విభాగం నుండి ఎంపిటి చదువుతున్న షేక్ గౌస్ బాషా ప్రథమ బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్‌వి కుమార్ ప్రొఫెసర్ డాక్టర్ కె. మాధవిని, విద్యార్థి షేక్ గౌస్ భాషాలను అభినందించారు.

ఫల సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 25 మంది నిరుపేద వృద్ధులకు సోమవారం ఫల సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావం పెంపొందించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు రోటేరియన్ శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి రోటేరియన్ జిజినాయుడు, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ రోటేరియన్ బి మయూరి శ్యామ్ యాదవ్, రవికుమార్ పాల్గొన్నారు.

'పది' భవిష్యత్తుకు తొలిమెట్టు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించడం ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకు తొలి మెట్టని పేర్కొని అమరావతి అన్నారు. స్థానిక సరస్వతి భాయి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం 'పేరెంట్స్ డే' నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అమరావతి ముందు విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు పది పరీక్షలపై దిశా నిర్దేశం చేశారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ర్యాంకుల పంట ఖాయమన్నారు.

మూడు స్థానాలు హర్షణీయం

- చిత్తూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు షణ్ముగ రెడ్డి

మాట్లాడుతున్న చిత్తూరు జిల్లా బిసిసెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చిందని జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగ రెడ్డి అన్నారు. సోమవారం పుత్తూరు టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బీసీలపై దాడులు, హత్యలు, అక్రమ కేసులు వేధింపులు జరిగాయని కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక బీసీల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెళుతోందన్నారు. టిడిపి ఆవిర్భావం నుంచి బీసీల పార్టీగా గుర్తింపుతో పాటు బీసీల అభివృద్ధి తోడ్పడుతుందని అన్నారు . తాజాగా మూడు ఎమ్మెల్సీ స్థానాలను బడుగు బలహీన వర్గాలకు చెందిన బీద రవిచంద్ర, బీటీ నాయుడు, దళిత బిడ్డ కావలి గ్రీష్మకు కేటాయించడంతో టీడీపీ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ కార్యదర్శి లక్ష్మీపతి, ఒంగోలు జిల్లా బీసీల అధ్యక్షులు బ్రహ్మయ్య , మునిరత్నం పాల్గొన్నారు.

ఆమనగంటి సేవలు అజరామరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఏపీ ఎన్జీవో సంఘం వ్యవస్థాపకులు ఆమనగంటి శ్రీరాములు సేవలు అజరామరమని ఆ సంఘం శ్రీకాళహస్తి తాలూకా అధ్యక్షులు చెంచురత్నం యాదవ్ కొనియాడారు. ఏపీ ఎన్జీవో సంఘం వ్యవస్థాపకులు ఆమనగంటి శ్రీరాములు 104వ జయంతిని స్థానిక ఏపీ ఎన్జీవో హోంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెంచురత్నం యాదవ్ మాట్లాడుతూ శ్రీరాములు ఉద్యోగుల సంక్షేమం కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు, పురుషోత్తం గౌడ్, వెంకయ్య, భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

'టిడిపితోనే ఉన్నత పదవులు'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): బడుగు బలహీన వర్గాలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నత పదవులు ఇచ్చేది ఒక్క టిడిపినే అని తిరుపతి పార్లమెంటు డివిజన్ అధ్యక్షులు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ జి. నరసింహ యాదవ్ అన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ శాసనమండలి అభ్యర్థుల ఎంపికలో కూడా పార్టీ సిద్ధాంతాల మేరకు బడుగు బలహీన వర్గాలకు ప్రాధాన్యమిచ్చి అభ్యర్థులుగా ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు జగన్నాథం, రాజయ్య, రామారావు పాల్గొన్నారు.

హోంగార్డులు కీలకం

హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్

దర్బార్‌లో పాల్గొన్న హోంగార్డ్స్ కమాండెంటు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: హోం గార్డులు పోలీసు శాఖకు చాలా కీలకమని హోం గార్డ్సు కమాండెంట్ మహేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో రాయలసీమ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం మహేష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా హోంగార్డ్స్ పరేడ్ తనిఖీ, దర్బార్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హోంగార్డ్స్ కమాండెంట్ మాట్లాడుతూ ప్రజలకు దగ్గరగా ఉంటూ మంచి సేవలు అందిస్తూ, అధికారుల మన్ననలను పొంది పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. మనకు దొరికే కొంత సమయాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా ఆరోగ్యకర జీవనాన్ని గడపాలని ఆకాంక్షించారు. కేటాయించిన విధులు నిబద్ధతతో పని చేయాలని, మన పనే మనకు గుర్తింపు తెస్తుందన్నారు. అనంతరం దర్బార్ నిర్వహించి హోంగార్డుల సమస్యలు అడిగి తెలుసుకొని ఎస్‌పి వి హర్షవర్ధన్ రాజు దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్ డిఎస్పి చిరంజీవి, ఆర్‌ఐ పోతల రాజు, హోంగార్డు ఇన్‌ఛార్జులు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నంది మండలం బాలకృష్ణంరాజు దాతృత్వంలో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ రాజా చేతుల మీదుగా గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ షరీనా మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక 11 సంవత్సరాల నుండి నిరంతరాయం ఈ కార్యక్రమం చేస్తున్నందుకు వారిని అభినందిస్తున్నానని తెలిపారు. దాత నంది మండలం బాలకృష్ణ రాజుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బాలకృష్ణంరాజు మాట్లాడుతూ తాను జేవీవీ ద్వారా అనేక కార్యక్రమాలు చేయడం ఆనందంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, చెంచు నారాయణ, పురుషోత్తమ రావు, ప్రభాకర్, వెంకట్, సుబ్బారావు, సుమన్, రజనీకాంత్, మస్తాన్, ఇబ్రహీం, శ్రీనివాసాచారి, సాయి పాల్గొన్నారు.

అన్ని ఆరోగ్య సేవలు అందుతున్నాయా?

వైద్యాధికారి చైతన్య

గర్భిణులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టరు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : 'గర్భిణులకు వైద్య ఆరోగ్య సిబ్బంది నుండి అన్ని ఆరోగ్య సేవలు అందుతున్నాయా?' అంటూ గర్భవతులను వైద్యాధికారి చైతన్య ప్రశ్నించారు. సోమవారం దొరవారిసత్రం పిహెచ్‌సిలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజనలో భాగంగా గర్భిణులకు డాక్టర్ చైతన్య వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు కాన్పు వరకు ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు అవసరమైన ఆరోగ్య సేవలు సకాలంలో అందించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. రక్తహీనత కల వారికి ఐరన్, ఇతర పుష్టికర ఆహారం తీసుకోవాలన్నారు. ప్రసవ సమయంలో 108 సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పు అయ్యేట్లు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఆరోగ్య సలహాల కోసం సమీపంలోని ఎంఎల్ హెచ్‌పి, ఏఎన్ఎంలను సంప్రదించాలని సూచించారు.

'యువత పోరు'కు సిద్ధం కండి: వైసిపి

యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పిలుపు మేరకు ఈ నెల 12వ తేదీ తిరుపతి కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న యువత పోరు' నిరసనకు సిద్ధం కావాలని వైసిపి మండల నాయకులు పిలుపునిచ్చారు. వైసిపి జిల్లా అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ గురుమూర్తి , సత్యవేడు ఇన్‌ఛార్జి నూకతోటి రాజేష్ పిలుపు మేరకు చేపట్టిన యువత పోరును జయప్రదం చేయాలని కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను వైసిపి మండల నాయకుడు కె మని నాయుడు వైస్ ఎంపీపీ, సర్పంచులు, మండల నాయకులు, యువకులతో కలిసి సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తిరుపతి సిటీ : 'యువత పోరు'ను విజయవంతం చేయాలని చంద్రగిరి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కోరారు. సోమవారం యువత పోరుకు సంబంధించిన పోస్టర్లను తుమ్మలగుంటలో ఆవిష్కరించారు. చంద్రగిరి నియోజక వర్గంలోని ఆరు మండలాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధిత విద్యార్థులను, వారి తల్లిదండ్రులను వెంట బెట్టుకుని తిరుపతి కలెక్టర్ కార్యాలయం వద్దకు తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

వెంకటగిరి: యువత పోరును విజయవంతం చేయాలని వెంకటగిరి పట్టణ వైసిపి కన్వీనర్ పులి ప్రసాద్ రెడ్డి తెలిపారు. స్థానిక నేదురుమల్లి నివాసంలో యువత పోరు పోస్టర్లను వారు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఎమ్మెల్యే నారాయణ, ఆరి శంకరయ్య, సుబ్బారావు, నాయకులు కందాటి రాజారెడ్డి, పేచిరాజ్, సిరాజుద్దీన్, రసూల్ , సురేష్ పాల్గొన్నారు.

సగం మందికే రేషన్

- మిగిలిన వారికి మొండి చెయ్యి - నిరుత్సాహంగా ప్రజలు

ప్రజాశక్తి- ఏర్పేడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పేదలకు అందిస్తున్న ఉచిత రేషన్ బియ్యం పథకం నానాటికి నిర్వీర్యమైపోయే స్థితికి వచ్చేలా వుందని సిపిఎం నాయకులు రంగయ్య అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లడుతూ ప్రతి నెల మొదటి వారంలో ఇచ్చే రేషన్ బియ్యం ప్రతి పంచాయతీలో సగం మందికి మాత్రమే ఇస్తున్నారని, మిగతా వారికి మొండి చెయ్యి చూపిస్తున్నారని, రెండు నెలల నుంచి ఇదే దుస్థితి ఏర్పడడం వల్ల సామాన్యులు ఎలా బతకాలని ప్రశ్నించాడు. ప్రజలు రేషన్ డీలర్లను ప్రశ్నించగా స్టాక్ తక్కువగా వస్తోందని మేము ఏమి చేయలేమని ఎవరు ముందుగా వస్తే వాళ్లకు మాత్రమే రేషన్ ఇస్తామని చెబుతున్న మొండి సమాధానంతో పేద ప్రజలు లబోదిబోమంటున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రంగయ్య మాట్లాడుతూ ఏర్పేడు మండలంలోని మొత్తం 40 పంచాయతీలలో ఇదే పరిస్థితి కనబడుతున్నదని తెలిపారు. ఏర్పేడు ఎమ్మార్వో, ఇతర అధికారులు ఈ రేషన్ సమస్యపై దృష్టి సారించి ఉచిత రేషన్ ను ప్రతి పేదవారికి అందేలా చూడాలని డిమాండ్ చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే సిపిఎం తరపున ప్రతి పంచాయతీలోని ప్రజలతో మమేకమై ఎమ్మార్వో ఆఫీస్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని తెలిపారు.

పైకప్పు పునరుద్ధరణపై హర్షం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ పైకప్పు లీకేజీ పునరుద్ధరణ పనులు నూరు శాతం పూర్తవడమే కాకుండా విజయవంతం కావడంపై మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి సహకారాన్ని ఎంతైనా కొనియాడాల్సిందేనని తెలిపారు. ఆలయ పైకప్పునకు నిర్వహించిన పునరుద్ధరణ పనులు సంప్రదాయ పద్ధతుల్లో విజయవంతంగా పూర్తయ్యాయనీ, 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ పునరుద్ధరణ పనులను చేపట్టారన్నారు. ప్రత్యేకంగా వర్షపు నీటి లీకేజీని నివారించేందుకు ప్రాచీన, పర్యావరణహిత పద్ధతులలో పనులను చేపట్టినట్లు య్ తెలిపారు. ఎంపీ మద్దిల గురుమూర్తి విజ్ఞప్తి మేరకు పూణే వెంకటేశ్వర హేచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత బి.వెంకటేశ్వరరావు రూ.5 కోట్ల వ్యయంతో ఈ పనులను చేపట్టారని తెలిపారు.

మెరుగైన విద్యాబోధన అందించాలి

విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని వేణుగోపాల పురం, నెలవాయి, బుచ్చినాయుడు కండ్రిగ జెడ్‌పి హైస్కూలులలో ప్రాథమిక పాఠశాల, నింది కండ్రిగ, నీర్పకోట పాఠశాలలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు పట్టికను పరిశీలించారు. ఆయన మాట్లా డుతూ విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన, శుభ్రమైన భోజనం పెట్టాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి భోజనంలోని లోటుపాటులను తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల సంబరాలు

సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఎమ్మెల్సీ అభ్యర్థిగా మరోసారి బీద రవిచంద్రకు టిడిపి అధినేత చంద్రబాబు అవకాశం కల్పించడంతో గూడూరులో ఆ పార్టీ శ్రేణులు సోమవారం సంబరాలు నిర్వహించారు. టిడిపిలో అనేక పదవులు అలంకరించిన బీద రవిచంద్రకు మరోసారి ఎమ్మెల్సీ అవకాశం దక్కింది. ఆయన పేరును ప్రకటించడంతో స్థానిక టిడిపి కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బాణా సంచా పేల్చారు. స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య మాట్లాడు తూ..పార్టీకి వీర విధేయుడిగా ఉన్న బీద రవిచంద్ర పేరును ఎమ్మెల్సీ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఆయన పార్టీలో ఎన్నో పదవులు పొందాలని ఆకాంక్షించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంబరాల్లో నాయకులు రహీమ్, సుధాకర్, ఓమ్, సునీల్, ముమ్మడి వెంకటేశ్వర్లు, చరణ్, సందీప్, సాయి, శ్రీనివాసులు, అమరయ్య నాయుడు పాల్గొన్నారు.

రేపు దళితుల రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: గత సంవత్సరం రోజులుగా ఇంటి స్థలాల కోసం బియన్ కండ్రిగ తహశీల్దారుకు విన్నవించుకున్నామని, సమస్య పరిష్కారం కాకపోవడంతో ఈ నెల 12వ తేదీ అందరూ కలిసి స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా అనంతరం రిలే నిరామార దీక్ష చేపట్టనున్నట్లు బుచ్చినాయుడు కండ్రిగ మండలం కనమనంబేడు దళితులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమమునకు సిపిఐ రాష్ట్ర నాయకులు హరనాధరెడ్డి, సిపిఐ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు రామానాయుడు, తిరుపతి జిల్లా సిపిఐ కార్యదర్శి మురళి, తదితరులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమం నేపథ్యంలో బిఎన్ కండ్రిగ ఎస్ఐ విశ్వనాథ నాయుడుకు వినతిపత్రం అందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

నేడు మామిడి రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఉద్యాన శాఖ వారు మామిడి సస్యరక్షణ, పండ్ల సంరక్షణ , మార్కెటింగ్ సదుపాయాలపై మంగళవారం ఉదయం 9.30 గంటలకు పుత్తూరు, మార్కెట్ యార్డువద్ద వడమాలపేట, పుత్తూరు, నారాయణవనం పరిధిలోని మామిడి రైతులకు శిక్షణ నిర్వహిస్తున్నారని పుత్తూరు ఉద్యానవన శాఖ అధికారి వెంకట సౌజన్య, సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉద్యాన శాస్త్రవేతలు , జిల్లా ఉద్యాన అధికారి రానున్నారని తెలిపారు. మామిడి రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీకాళహస్తికి భూగర్భ డ్రైనేజీ అవసరం

- రూరల్, అర్బన్ తహశీల్దారు కార్యాలయాలు కావాలి
- శాసన సభలో ఎమ్మెల్యే బొజ్జల

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అవసరమని ఈ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ అసెంబ్లీలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సోమవారం ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మురుగు కాలువల శుభ్రత గాలికొదిలేశారని, ఈ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఆర్డీవో కార్యాలయంతో పాటు తహశీల్దారు కార్యాలయాలు దుస్థితిలో ఉన్నాయని తెలిపారు. తొట్టంబేడు తహశీల్దారు కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుని స్లాబు నుంచి పెచ్చులు ఊడ పడుతున్నాయని వాపోయారు. వర్షం వస్తే కార్యాలయం ఉరుస్తోందన్నారు. రేణిగుంట తహశీల్దారు కార్యాలయం దుస్థితిలో వుందన్నారు. కిటికీలు, తలుపులు లేక పాత దుస్తులు అడ్డుగా పెట్టి విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఉద్యోగులు భయాందోళనతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. శ్రీకాళహస్తి మున్సిపాల్టీలో లక్షకుపైగా జనాభా, శ్రీకాళహస్తి రూరల్ మండలంలో 85వేల మందికిపైగా జనాభా ఉన్నా, రెండింటికీ ఒకటే తహశీల్దారు కార్యాలయం వుందని, దీన్ని విభజించి పురపాలక సంఘానికి, రూరల్ మండలానికి వేర్వేరు కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్డీవో కార్యాలయానికి కనీస వసతులు లేవన్నారు. తగిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. రెవెన్యూ కార్యాలయాల దుస్థితిని శాసన సభలో వివరించడంతో రెవెన్యూ ఉద్యోగులు హర్షం వ్యక్తం

'శ్రీరామ'లో ప్రాంగణ ఎంపికలు

ఎంపికైన విద్యార్థినులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరానికి చెందిన గ్లోబల్ లాజిక్ అనే బహుళజాతి కంపెనీ ఆధ్వర్యంలో బీటెక్ చివరి సంవత్సర విద్యార్థినీ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. ప్రాంగణ ఎంపికలలో భాగంగా విద్యార్థులకు రాత పరీక్ష, ఉమ్మడి చర్చ, టెక్నికల్ ఇంటర్వ్యూలు నిర్వహించి 37 మంది విద్యార్థులకు మూడు లక్షల రూపాయల వార్షిక వేతనంతో ఉపాధి అవకాశాలు కల్పించామని కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి తెలిపారు. ప్రాంగణ ఎంపికల్లో ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవిందు కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె జయచంద్ర, కంపెనీ ప్రతినిధి జి దీప్తి, కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ టి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ధాన్యం ట్రాక్టర్ బోల్తా

బోల్తా పడిన ధాన్యం ట్రాక్టరు

ప్రజాశక్తి-తడ: తడ మండలంలోని మాంబట్టు సమీపంలోని సుందర పురం గ్రామం వద్ద జాతీయ రహదారి పై సోమవారం ధాన్యం ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ట్రాక్టర్ నెల్లూరు చెన్నై హైవే నుండి అపాచీ రోడ్డు మీదుగా మాంబట్టుకు వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. ట్రాక్టర్ డ్రైవర్ అక్కడి నుండి పరారీ అయ్యాడు. ట్రాక్టరులో సుమారు 20 ధాన్యం బస్తాలు ఉన్నట్లు తెలుస్తోంది. బస్తాలు చిరిగి ధాన్యం హైవే రోడ్డుపై పడడంతో తీయడానికి కొంత ఇబ్బందిగా మారింది. సమాచారం అందుకున్నతడ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈఎస్‌ఐ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు

మాట్లాడుతున్న ఈఎస్‌ఐ ఆస్పత్రి సూపరింటెండెంటు డాక్టరు శ్యాంబాబు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: కార్మికుల అభ్యున్నతి, ఆరోగ్యం కోసం ఇఎస్‌ఐ అందిస్తున్న పథకాలను, వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి ఈఎస్ ఐ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం శ్యాంబాబు పేర్కొన్నారు. స్థానిక ఆర్‌సి రోడ్ లోని ఈఎస్‌ఐ ఆసుపత్రిలో సోమవారం ఏర్పాటు చేసిన 74వ ఈఎస్ ఐ కార్పొరేషన్ ఆవిర్భావ మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో డాక్టర్ శ్యాంబాబు, ఇతర డాక్టర్లు మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చర్యలు తీసుకొంటున్నాయని, ఈఎస్‌ఐ అందిస్తున్న సేవలపై అవగాహనా కలిగి ఉండాలన్నారు. తిరుపతి ఆసుపత్రిలో లబ్ధిదారులకు మరిన్ని వైద్య సేవలు పెంచేందుకు చర్యలు చేపట్టా మని మెడికల్ సూపరింటెండెంట్ శ్యాంబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, స్పెషలిస్ట్ డాక్టర్స్ కె శ్రీధర్, రామకృష్ణ, పద్మావతి, సునీత, ఆఫీస్ అధికారి ఎం నారాయణప్ప, నర్సింగ్ అధికారిణులు సి అమ్ములు, డి విజయకుమారి, ఇతర డాక్టర్లు, సిబ్బంది, లబ్ధిదారులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌పై చర్య తీసుకోవాలి

ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి నదియా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి ఎక్సైజ్ సూపరింటెండెంట్‌పై వెంటనే చర్య తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బి నదియా డిమాండ్ చేశారు. సాయి నగర్ పంచాయతీలో నడుపుతున్న బ్రాందీ షాపును తక్షణమే ఎత్తివేయాలని కోరుతూ కలెక్టర్ వెంకటేశ్వర్‌కి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బి నదియా మాట్లాడుతూ తిరుపతి రూరల్ మండలం సాయినగర్ పంచాయతీలో ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్న బ్రాందీ షాపులు నడుపుతూ పై అధికారులకు ఎక్సైజ్ సూపరింటెండెంటు తప్పుడు సమాచారం అందిస్తూ ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. ఫ్రెండ్లీ వైన్ షాప్ వల్ల రోజుకు బ్యాంకుకు వచ్చే మహిళలు ఇబ్బందులెదుర్కొంటున్నారన్నారు. పీజీ అమ్మాయిలకు రక్షణ కరువైందని వెంటనే బ్రాందీ షాపు తొలగించాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. తక్షణమే బ్రాందీ షాపును తొలగించకుంటే జరిగే పరిణామాలకు ఎక్సైజ్ అధికారులు, ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సి రత్నమ్మ , విజయ పాల్గొన్నారు.

వైసిపి వాణిజ్య విభాగం అధ్యక్షుడుగా నిరంజన్ రెడ్డి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గం వైసిపి వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా రామచంద్రాపురం మండలం నెమళ్లగుంటపల్లికి చెందిన బోడిరెడ్డి నిరంజన్ రెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నియామక పత్రం అందించారు. రాజకీయ కుటుంబం నుంచి యువ నాయకుడుగా ఎదిగి నియోజకవర్గ స్థాయి పదవి పొందిన నిరంజన్ రెడ్డికి నాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా ఎంపిక చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలకు, రామచంద్రాపురం మండల వైసిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గ వర్తక, వాణిజ్య రంగాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

సావిత్రి బాయి పూలే అందరికీ ఆదర్శం

ఎస్‌వియు ఇన్‌ఛార్జి విసి ఆచార్య అప్పారావు

మాట్లాడుతున్న ఎస్‌వియు ఇన్‌ఛార్జి విసి అప్పారావు

ప్రజాశక్తి - క్యాంపస్ : భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘసంస్కర్త ,రచయిత జ్యోతి సావిత్రిబాయి పూలే అందరికీ ఆదర్శమని ఎస్‌వియు ఇన్‌ఛార్జి విసి ఆచార్య అప్పారావు పేర్కొన్నారు. జ్యోతిబాయి పూలే 128వ వర్ధంతి వేడుకలను ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్వియూ ప్రకాశం భవనంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వర్సిటీ ఇన్‌ఛార్జి విసి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ నేడు భారత దేశంలో మహిళా సాధికారత కొనసాగుతుందంటే దానికి మూల స్తంభం సావిత్రిబాయి పూలే అన్నారు. ఆమెను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి, డాక్టర్ నారాయణ గౌడ్, ఎస్ వి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య భాస్కర్ రెడ్డి, ఆచార్య అనురాధ, ఆచార్య ప్రయాగ ,విద్యార్థి నాయకులు చిరంజీవి ,హరికృష్ణ యాదవ్, ప్రవీణ్, రమణయ్య విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE III ADDITIONAL DISTRICT JUDGE OF TIRUPATI
I.A.No. 20/2024, A.S.No. 14/2023
1.K.Varalakshmi & others ...Petitioners/Appellants
V/s
S.Kasthuri & others ...Respondents
NOTICE TO RESPONDENTS No. 3 & 6
R3) D.Nagulu, D/o D. Venkatesh Mandadi, Parasala Street, Tirupati Post & Town, Tirupati District
R6) P.Jyothi,D/o late P.Balaram, D.No.4-1-13C. Patnool Street, Tirupati Post & Town, Tirupati District
Please take notice that the Petitioners/Appellants filed the above petition in I.A.No. 19/2024 for the grant of temporary injunction restraining the respondents 1 to 9 their men from in any way interfering with the peaceful possession and enjoyment of the petition schedule property and the matter is posted for your appearance before the above said Hon'ble Court on **20-03-2025** at 10:30AM either in person or through your counsel. In the event of your failure to appear the matter will be decided Ex-Parte.
Hearing Date: 20-03-2025
(By Order of the Court)
M.VIJAYSEKHAR
Advocate, Tirupati. Cell: 9701185012

IN THE COURT OF THE III ADDITIONAL DISTRICT JUDGE OF TIRUPATI
I.A.No. 19/2024, A.S.No. 14/2023
1.K.Varalakshmi & others ...Petitioners/Appellants
V/s
S.Kasthuri & others ...Respondents
NOTICE TO RESPONDENTS No. 3 & 6
R3) D.Nagulu, D/o D. Venkatesh Mandadi, Parasala Street, Tirupati Post & Town, Tirupati District
R6) P.Jyothi,D/o late P.Balaram, D.No.4-1-13C. Patnool Street, Tirupati Post & Town, Tirupati District
Please take notice that the Petitioners/Appellants filed the above petition in I.A.No. 19/2024 for the grant of temporary injunction restraining the respondents 1 to 9 their men from in any way interfering with the peaceful possession and enjoyment of the petition schedule property and the matter is posted for your appearance before the above said Hon'ble Court on **20-03-2025** at 10:30AM either in person or through your counsel. In the event of your failure to appear the matter will be decided Ex-Parte.
Hearing Date: 20-03-2025
(By Order of the Court)
M.VIJAYSEKHAR
Advocate, Tirupati. Cell: 9701185012

IN THE COURT OF THE X ADDITIONAL DISTRICT JUDGE OF TIRUPATI
A.S.No. 14/2023
1.K.Varalakshmi & others ...Appellants
V/s
S.Kasthuri & others ...Respondents
NOTICE TO RESPONDENTS No.3, 6 & 15
R3) D.Nagulu, D/o D. Venkatesh Mandadi, Parasala Street, Tirupati Post & Town, Tirupati District
R6) P.Jyothi,D/o late P.Balaram, D.No.4-1-13C. Patnool Street, Tirupati Post & Town, Tirupati District
15) A.Revathi Reddy, W/o V.Venugopal, D.No.16-5-400, Kasthuribai lane, Tirupati Post, Tirupati District
Please take notice that the Appellants filed the above appeal to set aside the judgment and decree made in O.S.No. 124 OF 2014 and the matter is posted for your appearance before the above said Hon'ble Court on **20-03-2025** at 10:30AM either in person or through your counsel. In the event of your failure to appear the matter will be decided Ex-Parte.
Hearing Date: 20-03-2025
(By Order of the Court)
M.VIJAYSEKHAR
Advocate, Tirupati. Cell: 9701185012

టిటిడి వెబ్‌సైట్‌లోనే దర్శనం టికెట్లు బుక్ చేసుకోవాలి: టిటిడి

ప్రజాశక్తి - తిరుమల: శ్రీవారి భక్తులు దర్శన టికెట్లు, ఆర్జిత సేవా టికెట్లు, వసతి గదులను బుక్ చేసుకునేందుకు అధికారిక వెబ్‌సైట్ ను మాత్రమే వినియోగించాలని టిటిడి నిఘా, భద్రతా విభాగం విజ్ఞప్తి చేసింది. నకిలీ వెబ్‌సైట్లను నమ్మి మోసపోవద్దని స్పష్టం చేసింది. నకిలీ వెబ్‌సైట్లను సంప్రదించి మోసపోయినట్లు పలువురు భక్తుల నుండి టిటిడికి పలు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు టిటిడి నిఘా, భద్రతా విభాగం అధికారులు నకిలీ వెబ్‌సైట్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానాలకు సంబంధించిన సమాచారం కోసం, శ్రీవారి దర్శన టికెట్లు, ఆర్జిత సేవా టికెట్లు, వసతి గదులను బుక్ చేసుకునేందుకు అధికారిక వెబ్‌సైట్ హెచ్‌టిటిపిఎస్: టిటిడి దేవస్థానం,.ఏపీ.జివోవి.ఇన్ మాత్రమే వుందని తెలిపారు. ఈ వెబ్‌సైట్ కు సంబంధించిన సమాచారం, ఇతర వివరాల కోసం టిటిడి కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నెంబర్ 155257 ను సంప్రదించాలని సూచించారు.

తెప్పలపై రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి విహారం

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామి తెప్పలపై విహరించారు. ముందు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధుల్లో వైభవంగా ఊరేగించి శ్రీవారి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు విద్యుద్దీపాలతో అందంగా అలంకరించిన తెప్పపై స్వామివారు ఆశీనులై పుష్కరిణిలో మూడుసార్లు విహరించారు. వేదం, గానం, నాదం మధ్య తెప్పోత్సవం వేడుకగా నిర్వహించారు. మూడవరోజు శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామి తిరుచ్చిపై సర్వాలంకార భూషితుడై పురవీధుల్లో ఊరేగిన అనంతరం కోనేటిలోని తెప్పపై ఆశీనుడై మూడుసార్లు విహరించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చినజీయర్ స్వామి, టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, వీజీవో శ్రీ రామ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

విద్యార్థులకు అండగా యువత పోరు: వైసిపి

ప్రజాశక్తి. - పుత్తూరు టౌన్ :

విద్యార్థులకు అండగా నిలబడి యువత పోరు చేద్దామని మాజీ మంత్రి ఆర్కేరోజా సోదరులు కుమారస్వామి రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మాజీమంత్రి నివాస కార్యాలయం వద్ద ఆయన యువతపోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం గ్రామ సభ

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ:

ఇంటి స్థలాలు మంజూరు చేసేందుకు కనమనంబేడులో సోమవారం రెవెన్యూ అధికారులు సోమవారం గ్రామసభ నిర్వహించారు. కనమనంబేడు గ్రామస్తులు ఇటీవల ప్రజా సమస్యల పరిష్కా ర వేదికలో బిఎన్ కండ్రిగ తహశీల్దారుకు 179 మందికి ఇంటి పట్టాలు ఇవ్వాలని ఇటీవల వినతిపత్రం అందించారు. స్పందిం చిన తహశీల్దారు సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులు ఆ గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి గ్రామ , సర్వేయరు, గ్రామస్తులు సి రమణయ్య, సి వీరస్వామి, వి సుబ్రహ్మణ్యం, గురువమ్మల సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో పంచాయతీదారులు కలిసి 179 మంది జాబితాలో 125 మందిని అర్హులుగా గుర్తించారు. ఈ ఇంటి స్థలాలు మండల కేంద్ర సముదాయంలో సర్వే నంబర్ 252.253 లలోనే ఇంటి పట్టాలు కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని తహశీల్దారుకు తెలిపి చర్యలు తీసుకుంటామని మండల ఆర్ఐ మల్లయ్య గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భారత సముద్ర వాణిజ్యానికి మహర్దశ

వైసీపీ ఎంపీ డాక్టర్ ఎం గురుమూర్తి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్:

భారత సముద్ర వాణిజ్యానికి మహర్దశ పట్టనుందని వైసీపీ సీనియర్ నేత, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి అన్నారు. ఇందుకు బిల్స్ ఆఫ్ లేడింగ్ బిల్లు-2024 ఎంతగానో ఉపకరిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ బిల్లుపై చర్చలో భాగంగా గురుమూర్తి పార్లమెంటులో సోమవారం మాట్లాడుతూ కొన్ని సవరణలు మినహా, సంపూర్ణ మద్దతు తమ పార్టీ తరపున ఇస్తున్నామన్నారు. ఈ బిల్లు కారణంగా సముద్ర వాణిజ్యంలో సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవచ్చన్నారు. దేశ సముద్ర చట్టాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మార్చడమే లక్ష్యంగా బిల్స్ ఆఫ్ లేడింగ్ బిల్లు-2024 ప్రవేశ పెట్టారన్నారు. బిల్లు ఆమోదం పొందడం ద్వారా వాణిజ్య రంగాన్ని ఆధునీకరించి ప్రపంచ మార్కెట్‌లో మన దేశం పోటీకి సిద్ధమవుతుందన్నారు. వివాదాలు తగ్గుతాయని ఆయన అన్నారు. మేక్ ఇన్ ఇండియా లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లే దిశగా బిల్లులోని అంశాలున్నాయని ఆయన కొనియాడారు. తిరుపతి పార్లమెంటు పరిధి లోని దుగరాజపట్నం పోర్టు నిర్మాణం గురించి గురుమూర్తి మాట్లాడుతూ 2014 పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న దుగరాజపట్నం నౌకాశ్రయ అభివృద్ధి ఇంకా ప్రారంభం కాలేదన్నారు. 2018 నాటికే మొదటి దశ నిర్మాణం పూర్తి కావాల్సి వుండిందన్నారు. ఇప్పటికీ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని లోక్‌సభ దృష్టికి ఆయన తీసుకెళ్లారు. దీనిని తక్షణమే ప్రారంభించి, రాష్ట్ర సముద్ర వాణిజ్య అభివృద్ధిని వేగవంతం చేయాలని కోరారు.

పాఠ్యేతర అంశాల ప్రవేశం విద్యార్థి సంపూర్ణత్వానికి దోహదం : విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : పాఠ్యేతర అంశాలలో ప్రవేశం విద్యార్థి సంపూర్ణ జ్ఞానానికి దోహదం చేస్తుందని ఎస్‌వియు విసి అప్పారావు పేర్కొన్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీ వద్ద గల నోయిడా నగరం లోని అమిటీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోనిర్వహించిన జాతీయ విశ్వవిద్యాలయాల సాంస్కృతిక పోటీలలో ఎస్వీయూ ఫైన్ ఆర్ట్స్ అంశంలో ఓవరాల్ చాంప్ రెండవ స్థానం సాధించి వర్సిటీకి విచ్చేసిన బృందానికి టపాకాయలు, తారాజువ్వలతో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా వర్సిటీ విసి ఛాంబర్ లో ఏర్పాటుచేసిన సక్సెస్ మీట్ లో వర్సిటీ ఇన్‌ఛార్జి విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడులు మాట్లాడుతూ ఫైన్ ఆర్ట్స్ అంశం నందే కాకుండా, కల్చరల్ విభాగంలోనే వర్సిటీ చరిత్రలో మొట్టమొదటిసారి జాతీయస్థాయి ఓవరాల్ రెండవ ఛాంపియన్ గా నిలబడటం ఒక చరిత్ర అన్నారు. ఈ సాంస్కృతిక అంశాలలో నాయకత్వం వహించిన డాక్టరు వివేక్, ఆచార్య మురళీధర్‌ను, విజేతలను అభినందించారు. ఈ విజయం వర్సిటీకి గర్వకారణం

అని, ఇది నిరంతర కృషితో సాధ్యమైందన్నారు. ఇందులో మొదట వివిధ కళాశాలలో ఈ అంశాలపై పోటీలు, తర్వాత వర్సిటీ స్థాయిలో యువతరం కార్యక్రమంతో కళాకారులను వెలికి తీయడం, దీని తర్వాత దక్షిణ భారతంలోనూ ప్రతిభా చూపడం, చివరగా జాతీయ స్థాయి పోటీలో పాల్గొనే అవకాశం లభించడం వర్సిటీకి గొప్ప గౌరవం అని వారన్నారు. ఈ సంప్రదాయాన్ని ముందు ముందు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కల్చరల్ విభాగనికి చెందిన డాక్టరు ప్రత్తిపాటి వివేక్, ఆచార్య మురళీధర్, డా పాకనాటి హరికృష్ణ, శరత్ బాబు, ప్రసన్నకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ కార్యశాల

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో పదిరోజుల పాటు ఖండన ఖండఖాద్య గ్రంథా ధ్యయనంపై నిర్వహించిన అంతర్జాతీయ కార్యశాల విశ్వవిద్యాలయంలోని ప్రముఖ రమారంజన్ ముఖర్జీ ఆడిటోరియంలో సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీసత్యసాయి వేద ప్రతిష్ఠానం, న్యాసీ ప్రబంధకులు రిటైర్డ్ ఐఎఎస్ అధికారి కెఆర్ పరమహంసలు విచ్చేసి, విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జియస్ఆర్ కృష్ణమూర్తితో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులు కెఆర్ పరమహంస మాట్లాడుతూ వేదాంత శాస్త్రం మానవశాస్త్రోపకరణమని ఆ శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యడం మంచిదన్నారు. వేదాంత జ్ఞానాన్ని డిజిటలైజేషన్ చేసి ఆధునిక తరానికి అందించడం గొప్పవిషయని వివరించారు.

వేదం ఓఆర్‌జి వెబ్‌సైట్ ఆవిష్కరణ

ముఖ్య అతిథులు, వైస్ఛ్సలర్, వేదికపైన అతిథులు కలసి వేదం ఓఆర్‌జి వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ వెబ్‌సైట్‌లో వేద, వేదాంతాది విషయాలను ఒకచోట పొందుపరిచారు. విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జె రమాశ్రీ మాట్లాడుతూ ఈ వెబ్‌సైట్ విధానం, ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. విశ్వవిద్యాలయం అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా మాట్లాడుతూ ప్రశాంతి నిలయం సత్యసాయి ట్రస్ట్ ద్వారా ఎన్నో ప్రాచీన జ్ఞాన సంరక్షణకు ఎంతో కృషిచేస్తుందని వివరించారు. అనంతరం సభాధ్యక్షులు విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ జియస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ కాంచీపుర పీఠాధిపతుల ఆశీర్వాదంతో ఇలాంటి కార్యక్రమాలను ముందుకు తీసుకెళుతున్నామని వివరించారు. వేదపాఠాలను ఒకచోటకు చేర్చి వేదం ఓఆర్‌జి వెబ్‌సైట్ విశ్వవిద్యాలయం తరపున లోకార్పణం చెయ్యడం ఎంతో ఆనందదాయకమని వివరించారు. ప్రతి ఒక్కరూ వేదజ్ఞానాన్ని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ అద్వైతవేదాంత విభాగాధ్యక్షులు ప్రొఫెసర్ కె గణపతి భట్, విభాగ అధ్యపకులు ప్రొఫెసర్ సతీష కెయస్ డాక్టరు నాగరాజు భట్, డాక్టరు మనోజే షిండే అంగద్, డాక్టరు శివరామ దాయగుడే, విభిన్న విశ్వవిద్యా లయాల అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

తప్పి పోయిన బాలికల గుర్తింపు

ప్రజాశక్తి - వెంకటగిరి: తప్పిపోయిన ముగ్గురు బాలికలను వెంకటగిరి పోలీసులు సోమవారం గుర్తించి పట్టుకున్నారు. వెంకటగిరి టౌన్‌లోని హాస్టల్ 3లో చదువుతున్న ముగ్గురు బాలికలు ఈ నెల 9వ తేదీ 10వ తరగతి ప్రత్యేక స్టడీ నిమిత్తం బాలికల హైస్కూలుకు వెళ్లారు. తిరిగి సాయంత్రం 4.30 గంటలకు హాస్టల్ రావాల్సి వుండగా రాలేదు. దీంతో హాస్టలు వార్డెన్ స్కూలు, పరిసర ప్రాంతాల్లో విచారించారు. బాలికల ఆచూకీ లభ్యం కాకపోవడంతో అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు గూడూరు ఎస్‌డిపివో డాక్టరు గీతారాణి పర్యవేక్షణలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ విక్రమ్, నాయుడుపేట ఎస్‌డిపివో, ఎస్‌డిపివో నెల్లూరు టౌన్ సిఐ, తదితరులు బాలికలను సమీపంలో వుండగా వెతికి చాకచక్యంగా పట్టుకున్నారు. బాలికల ఆచూకీ కనుగొన్న వారికి ఎస్‌పి అభినందనలు తెలిపారు.

హక్కులు కాపాడేది రాజ్యాంగం మాత్రమే

రాయలసీమ మాలల జేఏసీ అధ్యక్షులు యమలా సుదర్శనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాజ్యాంగబద్ధంగా అభివృద్ధికి నోచుకోని ఎస్సీలకు రిజర్వేషన్ల ద్వారా అభ్యున్నతి చెందుతున్న సమయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అంబేద్కర్ రాజ్యాంగాన్ని రద్దు చేస్తూ మనువాద రాజ్యాంగాన్ని అమలు చేయడానికి కుట్రలు చేస్తోందని, అందులో భాగమే ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్ ద్వారా రిజర్వేషన్లను రద్దుకు కుట్ర పన్నిందని రాయలసీమ మాలల జేఏసీ అధ్యక్షులు యమలా సుదర్శనం పేర్కొన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎస్సీల మధ్య వర్గీకరణ చిచ్చు పెట్టింది చంద్రబాబు నాయుడు అన్నారు. నేడు మందకృష్ణ మాదిగ వర్గీకరణ పేరుతో మాలలపై కుట్ర చేస్తున్నారన్నారు. మాలలు నేటికీ వెనుకబడే ఉన్నారని, క్రిమిలేయర్ ద్వారా భవిష్యత్ తరాలకు రిజర్వేషన్లు లేకుండా చేసి మాలల ఎదుగుదల అణిచివేతకు కుట్ర జరుగుతుందన్నారు. దీనికోసం ఇప్పటికే మాలల సింహగర్జన సభలను నిర్వహించామని, ఈనెల 23న తిరుపతి వేదికగా హలో మాల - చలో తిరుపతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ మాలల జేఏసీ చీఫ్ కోఆర్డినేటర్ మల్లారపు మధు, ప్రభాకర్, జయరాం, మునిరత్నం, రాజేంద్రప్రసాద్, చెంగల్రాయులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాల ప్రచారం నిల్

ఆర్భాటాలకే పరిమితమవుతున్న పింక్ బస్సులు

ప్రజాశక్తి-కోట : క్యాన్సర్ నివారణ కోసం స్విమ్స్ ఆధ్వర్యంలో శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ద్వారా తిరుపతి జిల్లాలో చేస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు వల్ల పేదలకు ఎలాంటి ఉపయోగం లేదని వైసిపి కోట మండల అధ్యక్షులు పలగాటి సంపత్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి జిల్లా, కోట మండలం కొక్కుపాడులో నిర్వహించిన క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరంపై వైఎస్సార్సీపీ కోట మండల పార్టీ అధ్యక్షులు పలగాటి సంపత్ కుమార్ రెడ్డి మాట్లాడారు. క్యాన్సర్ ను మొదట్లోనే తెలుసుకుని అందుకు అనుగుణంగా వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రతీ పల్లెకు పింక్ బస్సుల ఏర్పాటు చేసి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని, అయితే వైద్య పరీక్షల గురించి పేదలకు ప్రచారం చేయడంలో వైద్యాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నట్లు తెలిపారు. నిరుపేదలైన ఎస్సీ,ఎస్టీ,బీసీ కాలనీలలో పూర్తిస్థాయిలో ప్రచారం చేయడం లేదని, కొందరు నాయకులను పక్కన పెట్టుకుని ఫొటో తీసుకుని వెళ్తున్నట్లు ఆరోపించారు.పేదల కోసం జరుగుతున్న ఈ కార్యక్రమం ద్వారా అందరికి సమాచారం అందించి,క్యాన్సర్ ను నిర్మూలన చేసేందుకు అధికారులు చొరవచూపాలని సంపత్ కుమార్ రెడ్డి కోరారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్ నెలకొల్పిన సెన్సోడైన్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: హాలియన్ (గతంలో గ్లాక్సోస్మిత్‌క్లైన్ కన్స్యూమర్ హెల్త్‌కేర్)కు చెందిన ప్రముఖ నోటి సంరక్షణ బ్రాండ్ (సెన్సోడైన్), 'ఆన్‌లైన్‌లో 24 గంటల్లో అత్యంత ఎక్కువ దంత పరీక్ష పరీక్షలను' విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను నెలకొల్పింది. ఈ సందర్భంగా కేటగిరి లీడ్ ఓవరాల్ హెల్త్ ఇండియా సబ్ కాంటినెంట్ కిష్లే సేథ్ మాట్లాడుతూ మహా కుంభ్ 2025లో రికార్డు నెలకొల్పగా, ఈ ప్రయత్నంలో 27,000 మందికి పైగా వ్యక్తులు దంత పరీక్షలు చేయించుకున్నారు. ఇది చురుకైన నోటి సంరక్షణ ప్రాముఖ్యత గురించి భారతీయులకు అవగాహన కల్పించడంలో ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుందన్నారు. తన నిబద్ధతను మరింత ముందుకు తోడ్కొని వెళ్లేందుకు సెన్సోడైన్ కొత్తగా విడుదల చేసిన రూ.20 ధరకు లభించే చిన్న టూత్‌పేస్ట్ ప్యాక్‌ను కూడా వితరణ చేసిందని తెలిపారు. ఇది సెన్సిటివిటీ రక్షణను మరింత సరసమైనదిగా, మరింత అందుబాటులోకి తీసుకువచ్చేలా తయారు చేశారు. ఈ రికార్డు సెన్సోడైన్ ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవ ప్రచారానికి నాంది పలికింది. ఒక దశాబ్ద కాలంగా, వినియోగదారులకు దంతాల సెన్సిటివిటీని ముందుగానే గుర్తించి పరిష్కరించుకునే సాధికారత కల్పిస్తూ, భారతదేశం వ్యాప్తంగా "చిల్ టెస్ట్"లను నిర్వహించింది. ఈ ప్రయత్నం లక్షలాది మంది తమ దంతాల పరిస్థితిని తెలుసుకునేందుకు, సకాలంలో సమస్యను పరిష్కరించుకుని, మళ్లీ తమకు ఇష్టమైన ఆహారాన్ని ఆస్వాదించేందుకు సహాయపడిందన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అశోక్ ధోబ్లే మాట్లాడుతూ సెన్సోడైన్‌లో, ప్రజలు తమ నోటి ఆరోగ్యం వైపు మొదటి అడుగు వేయాలని ప్రోత్సహించడమే మా లక్ష్యం అన్నారు. మహా కుంభ్-2025లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను నెలకొల్పడం కేవలం సంఖ్యలు మాత్రమే కాదు- ఇది వేలాది మంది వ్యక్తులను చేరుకోవడం, అవగాహన పెంచడం, నిత్యం మెరుగైన నోటి ఆరోగ్యాన్ని ప్రోత్సహించడమే అన్నారు. ఈ రికార్డు సాధించేందుకు సహకరించిన వినియోగదారులకు కృతజ్ఞతలు తెలిపారు.